# పాలిచ్చే తల్లి

మొన్న బస్సులో వూరెళ్ళినపుడు ఒక పల్లెటూరి అమ్మాయి అంతమందిలో నిర్భయంగా పవిట పక్కకు లాగి రవిక సర్ది పిల్లాడిని అడ్డం వేసుకుని పాలిస్తోంది. పైగా ఏటో ఆలోచిస్తూ పరధ్యాసగా వుంది. ఆ పిల్లడు కూడా ఒక చేత్తో తల్లితో ఆడుకుంటున్నాడు. నాకు ఒళ్ళు కంపరమెత్తింది. అంతమందిలో అలా సిగ్గు లేకుండా పాలిచ్చే తల్లిని స్త్రీజాతికే అవమానంగా భావించి మా వారు అటు చూస్తున్నారేమోనని ఆయనకేసి తిరిగాను, ఆయన అటే చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నారు. "ఎందుకు నవ్వుతున్నారు, ఆ సిగ్గులేని ఆడదాన్ని చూసి" అన్నాను కొంచెం మూతి బిగించి.

"లోకోత్తరమైన దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్నాను" అన్నారు ఏవీ సిగ్గులేకుండా—ఇలాటి సిగ్గులేని మొగుడితో ప్రయాణం చేస్తున్నానే అని నాకు తలబద్దలు కొట్టుకోవాలనిపించింది. లేచి వెళ్ళి ఆ పల్లెటూరి మొద్దు చెంపలు ఎడా పెడా వాయించాలనుకున్నాను. చాలామంది అటే చూస్తూనాన్నరు—చూసీ చూడనట్లు. ఎంత బరి తెగించింది? "కొంగు మీదకు లాక్కుని అటు తిరిగి పాలివ్వు తల్లీ" అని చెప్పాను దగ్గరకెళ్ళి ఈ ఎగ్జిబిషన్ను చూడలేక. "పిల్లవాడేడుస్తాడండీ గుక్కపట్టి" అంది. వాడింకా పాలు తాగుతూ మధ్యలో అటూ ఇటూ చూస్తూ కేరింతలు కొడుతూ తల్లి రవికతో ఆడుకుంటున్నాడు.

బస్సు దిగాక మావారన్నారు - "తల్లి పిల్లడికి పాలిచ్చే దృశ్యం చాలా గొప్పదనీ ప్రపంచంలో అంతకంటె గొప్ప దృశ్యం లేదు గనక తన్మయంతో చూసి ఆనందించాలనీ, పుణ్యవనీ చెప్పారు. ఓరినాయనో పుణ్య వంటున్నారు—ఇదేదో మోసంలాగుంది అనుకుని పుణ్యమెందుచేత అని ఉపనిషత్తుల్లో శిష్యుడు గురువుగార్ని అడిగినట్లు అడిగాను. "ఈ అమ్మాయ్ ఒకప్పుడు సిగ్గుపడుతూ తలుపువార నిలబడి భర్తను చూసి మధురంగా వూహించుకొని వుంటుంది."

"కావచ్చు"

"పేరంటాళ్ళు పదిమంది పట్టుకుని గదిలోకి తోసి గెడెట్టి వుంటారు అవునా?"

"పదిమందెందుకండీ రోడ్డురోలర్ని తోసినట్టు — ఒకళ్ళో ఇద్దరో చాలు."

"ఎందుచేత?"

"ఎందుచేతేమిటి మొగుడి దగ్గర కెళ్ళడానికి సిగ్గుగనక—"

"సిగ్గెందుకు ?"

"నా మొహం—అమ్మాయిలు సిగ్గుపడరుటండీ, గదిలో కెళ్ళేప్పుడు బ్యాట్మింటన్ కోర్టులో కెళ్ళినట్లు నడుచుకెళ్తారుటండీ?"

"వెళ్తారుగద—వెళ్ళి...."

"వెళ్ళి యివన్నీ ఎందుకడుగుతారు!"

"ఆ మొగుడ్ని ఓ పట్టాన దగ్గరకు రానివ్వరు ఎంచేత."

"ఏదో చిన్నతనం-సిగ్గు-భయం-కొత్త పైగా అంతా తెలిసిపోతుందేమోననే జంకు-ఇవన్నీ సహజాలు-"

"ఓసి వెర్రిదానా మరిప్పుడా అమ్మాయి పబ్లికు బస్సులో కూర్చుని ఒళ్ళో పిల్లడు రవికతో ఆడుకుంటూ పాలు తాగుతూంటే వాడి కిబ్బంది

కలుగుతుందని యిటూ అటూ కదలకుండా పాలిస్తూంటే ఎందుకు తప్పు పడతావు?"

"మరీ అట్లానా సిగ్గు లేకుండా...."

"మొగుడి దగ్గర కెళ్లినందుకు తప్పు బట్టవు, నవమాసాలు మోసు కుంటూ తిరిగినందుకు సిగ్గులేదని అనవు, తన మాతృత్వం సంపూర్ణ



మయిందని ఆనందిస్తూ పాలిస్తున్న తల్లిని చూసి సిగ్గులేని దంటావు. మీ పట్నవాసపు చదువుకున్న ఆడాళ్ళు నిజంగా స్త్రీజాతికే మచ్చ - ఏది అద్భుతమో ఏది లోకోత్తరమో దాన్నే అసహ్యించుకునే మీ లేడీస్ ఒకటో నంబరు రాస్కెల్సు, ఆవిడ వెధవ బస్సు నేవిటి ఆ పిల్లాడి కోసం లోకాన్నంతటినీ, మీ వెధవమోరల్సన్నిటినీ ధిక్కరించగలదు-"

"పోనీ పవిట వేసుకోకుండా అలా ధిక్కరించి నిలబడిన ఆడాళ్ళను ఆరాధిస్తో మమ్మల్ని తిట్టిపొయ్యండి. మీ కళ్ళు చల్లగా వుంటాయి."

"నా కళ్ళు చల్లగా వుంటాయి-నిజమే. మీరంతా అంతే — అసలు ఆడజాతే అంత. మాతృత్వం సిద్ధించగానే రంగు మార్చేస్తారు. పిల్లడో పిల్లో కలిగేవరకే సిగ్గూ, వయ్యారం, నాజూకుతనం, నామోషీని — ఒక్కసారి కడుపు పండిందో మగాడుగానే భర్త సింహాసనం మీంచి జారి కింద పడతాడు. నువ్వు వద్దావని ఆడది చెప్పదు, నవ్వుతూ కాలిపట్టెలు చూసు కుంటూ పిల్లాడ్ని ఒళ్ళో వేసుకుని పాలిస్తూ నీతో అవసరం తీరిందని చెప్పకుండా చెబుతుంది. అందుకే ఆ సీను అంత గొప్పగా వుంటుందని చెప్పాను."

"బావుందండీ వరస—మీ కివ్వాళేదో తిక్క పుట్టుకొచ్చింది."

"తిక్కకాదే—పురుటి సమయంలో చూడు. మగాడి అమాయకత్వం అనింపార్టెన్సు బయటపడుతుంది. ఒక స్త్రీ తను రెండయి మృత్యువుతో పోరాడేవేళ మగాడు బిక్కమొగం వేసుకుని వరండాలో పచార్లు చేస్తూ వుంటాడు. నేచర్ అంటే ప్రకృతి మగాడ్ని నిమిత్త మాత్రం చేసేసి వదిలింది. అటువంటి ఆడది మృత్యువును జయించి ఒక పసికందుని తెచ్చుకుని ఎంతో గర్వంతో పాలిస్తూ కళ్ళుమూసుకుని పాలిస్తూ ఆనందిస్తూంటే- ఆవిడ్ని సిగ్గు లేనిదని అవమానించే నీ బోటి నాగరిక యువతుల్ని తన్నాలి."

"అహ అల్లాగా. చాలావరకూ వెళ్ళిందే వ్యవహారం! పోనీ ఆడ జన్మ ఎత్తి పురుళ్ళ వార్డులో నర్సుగా చేరరాదూ—పుణ్యం వస్తుంది మీకు."

"నాకేం అభ్యంతరంలేదు కాని—"

"కాని ఏవిటి?"

"నేను ఆడజన్మ నెత్తితే నర్సు కాకుండానే పురుళ్ళవార్డుకి వెళ్ళాల్సి వస్తుంది కదా-"

"అవును అప్పుడేనా మీ పాలిచ్చే తల్లి కోరిక నెరవేరుతుందనుకుంటా—"

"అనుకో-కాని బస్సులో నువ్వు ఎదురుగా వుంటావే-"

"వుంటాను కాని అప్పుడు నేను పాలిచ్చే తల్లి లోకోత్తర దృశ్యాల్ని చూసి మీకుమల్లే మహత్తరంగా ఆనందిస్తా ననుకున్నారా?"

"మరి నువ్వు పరపురుషుడి వేషం వెయ్యవా?"

"వెయ్యను. మీకు ఆడబడుచుగా పుట్టి పవిట సరిగా వుంచుకో నందుకు ఆ లెంపా ఈ లెంపా వాయగొడతాను."

"మరి ఆ బస్సులోకి నువ్ ఎల్లా వస్తావ్ ?"

"మీరు బిడ్డని కని పాలియ్యగా లేంది నేనా బస్సులోకే రాలేనా ? ఎంత పిచ్చివారండీ—"